

'గిరి' విద్యార్థులకు ఏఐ బోధన
విద్యావ్యవస్థలో మార్పులను అంది పుచ్చుకునేందుకు గిరిజన సంక్షేమశాఖ సిద్ధమవుతోంది. గిరి విద్యార్థులకు ఏఐ ద్వారా విద్యా బోధన అందించాలని భావిస్తోంది. 8లో▸



గల్ఫ్ కార్మికుల సంక్షేమంపై ఆశలు..
కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత గల్ఫ్ కార్మికుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ నేపథ్యంలోనే 15 రోజుల క్రితం ప్రత్యేక సలహా మండలిని ఏర్పాటు చేసింది. 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
40.0/28.0

వాతావరణం
మధ్యాహ్నం ఎండతీవ్రత పెరగనుంది. వడ గాలులు వీస్తాయి. ఉక్కపోత ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

నేటి 'ప్రజావాణి' రద్దు

కైలాస్‌నగర్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని ఈ వారం రద్దు చేసినట్లుగా కలెక్టర్ రాజర్షిషా ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్ర భుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూ భారతి చట్టం అవగాహన కార్యక్రమాలు కొనసాగుతున్నందున కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా ప్రజలు విషయాన్ని గమనించాలని కోరారు.

నేడు యాపల్‌గూడ, తాంసిలో సదస్సులు
ఈనెల 28న ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని యాపల్‌గూడ, తాంసిలో భూ భారతి చట్టంపై అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

రేపు లాటరీ ద్వారా బార్ల ఎంపిక

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలో గతంలో రెన్యూవల్ కాని మూడు బార్లను లాటరీ ద్వారా ఎంపిక చేసేందుకు ఎక్సైజ్ శాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేయగా మూడు బార్ల కోసం 61 దరఖాస్తులు వచ్చినట్లు జిల్లా ఎక్సైజ్ అధికారి హిమశ్రీ తెలిపారు. ఈ నెల 29న ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ రాజర్షిషా సమక్షంలో లక్కీడ్రా ద్వారా ఎంపిక చేయనున్నట్లు వివరించారు. దరఖాస్తు చేసుకున్న వారు హాజరు కావాలని సూచించారు.

ప్రశాంతంగా 'మోడల్' ప్రవేశ పరీక్ష

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలోని మోడల్ స్కూళ్లలో ప్రవేశం కోసం ఆదివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉదయం నిర్వహించిన ఆరోతరగతి పరీక్షకు 1,059 మంది హాజరు కావాల్సిఉండగా, 879మంది హాజరయ్యారు. 180 మంది గైర్హాజరయ్యారు. అలాగే 7 నుంచి 10వ తరగతి కోసం నిర్వహించిన పరీక్షకు 774 మంది హాజరు కావాల్సి ఉండగా, 629 మంది హాజరైనట్లు డీఈవో శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ జిల్లా కమిటీ సభ్యులను ఎంపిక చేసేందుకు జిల్లాలోని అర్హులైన ఎస్సీ మహిళాఅభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జి ల్లా దళితాభివృద్ధి శాఖ అధికారి సునీతకుమారి ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హతగల వారు ఈ నెల 30లోగా కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కలెక్టర్ అధ్యక్షతన ఎంపిక ఉంటుందని తెలిపారు.

ఎన్‌సీటీఈ మెంటర్‌గా డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్

ఆదిలాబాద్‌టౌన్: జాతీయ ఉపాధ్యాయ శిక్షణ సంస్థ (ఎన్‌సీటీఈ) న్యూఢిల్లీ మిషన్ ఫర్ మెంటరింగ్ మెంటర్‌గా ప్రభుత్వ డైట్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కోల కిరణ్ కుమార్ ఎంపికయ్యారు. ప్రాథమిక స్థాయి విద్యార్థులకు ఏ విధంగా బోధన అందించడం, నూతన జాతీయ విద్యా విధానంలో వస్తున్న మార్పులు తదితర అంశాలపై జాతీయ స్థాయిలో శిక్షణ ఇవ్వనున్నారు. ఈమేరకు డైట్ కళాశాల పూర్వ విద్యార్థులు, ఛాత్రోపాధ్యాయులు ఆయనకు ప్రత్యే క అభినందనలు తెలిపారు.

బ్లడ్ బ్యాంక్ సద్వినియోగం చేసుకోవాలి



అంజలితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో నరేందర్

నార్నూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన బ్లడ్ బ్యాంక్‌ను సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్ అన్నారు. ఆస్పత్రిని ఆదివారం ఆయన సందర్శించారు. గాదిగూడ మండలం ఝరి పీహెచ్‌సీ పరిధిలోని మాలేపూర్ సబ్‌సెంటర్‌కు చెందిన అంజలికి రక్తం అవసరం కాగా ఆస్పత్రిలోని బ్లడ్ బ్యాంక్ నుంచి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏజెన్సీలో గిరిజనులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు నార్నూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో బ్లడ్‌బ్యాంక్ ఏర్పాటు చేశామన్నారు. గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఆస్పత్రి వైద్యాధికారి రాంబాబు తదితరులున్నారు.

ప్రైవేట్ వల





"ఉదయం 8 గంటలు.. ఆదిలాబాద్ పట్టణం గ్రీన్‌సిటీ ప్రాంతంలోకి ఓ ప్రైవేట్ పాఠశాల బస్సు వచ్చి ఆగింది. అందులో నుంచి విద్యార్థులకు బదులు టీచర్లు దిగారు. వారి చేతులో కరపత్రాలున్నాయి. ఇంటింటికి తిరుగుతూ 'మీ ఇంట్లో ఎందరు పిల్లలు ఉన్నారు.. ఏం చదువుతున్నారు.. మా పాఠశాలలో చేర్పించండి.. మంచి బోధన ఉంటుంది.. ఫీజులో రాయితీ కల్పిస్తాం.. స్కూల్ బస్ ఉందంటూ తల్లిదండ్రులకు చెప్పుకుంటూ వెళ్తున్నారు. అందులో ఒక టీచర్ పిల్లల వివరాలు నోట్‌బుక్‌లో నమోదు చేసుకుంటూ కనిపించారు.' ఈ ఒక్క చోటే కాదు.. జిల్లా వ్యాప్తంగా ఆయా ప్రాంతాల్లో ప్రైవేట్ యాజమాన్యాలు ప్రవేశాల కోసం ఇలా ప్రచారం చేపడుతున్నాయి.

- విద్యార్థుల ప్రవేశాల కోసం ప్రచారం షురూ
- ఉపాధ్యాయులకు టార్గెట్లు
- ఇంటింటికీ తిరుగుతున్న టీచర్లు
- తల్లిదండ్రులను మభ్యపెడుతూ అడ్మిషన్లు

ఆదిలాబాద్‌టౌన్: ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు అడ్మిషన్ల వేట ప్రారంభించాయి. తల్లిదండ్రులను మభ్యపెడుతూ తమ బడిలో చేర్పించేందుకు ప్రయత్నాలు షురూచేశాయి. ఈనెల 24నుంచి వేసవి సెలవులు మొదలయ్యాయి. అప్పటినుంచే ప్రైవేట్ యాజమాన్యాలు ఎన్నికల ప్రచారం తలపించేలా తమ ఉపాధ్యాయులను ఇంటింటికి తిప్పుతున్నారు. కరపత్రాలు పంచుతూ ఇప్పుడు అడ్మిషన్ చేయిస్తే రాయితీ ఇస్తామని చెబుతున్నారు. కొన్ని యాజమాన్యాలు ఫ్రీ అడ్మిషన్ అంటూ బుట్టలో వేసుకుంటున్నారు. ఈ మేరకు టీచర్లకు టార్గెట్లు ఇచ్చారు. ప్రతీ ఉపాధ్యాయుడు కనీసం 10 నుంచి 20 మందిని చేర్పించాలని ఆదేశించారు. లేకుంటే విధుల నుంచి తొలగిస్తామని హెచ్చరించడంతో వారు నానాతంటాలు పడుతున్నారు. ఉదయం 7గంటలకే విద్యార్థుల ఇళ్ల ముందు వాలుతున్నారు. తమ పాఠశాలలో బోధన బాగుంటుంది.. మంచి ఫలితాలు సాధిస్తున్నామంటూ తల్లిదండ్రులకు ఎర వేస్తున్నారు. అయితే ప్రభుత్వం బడిబాట నిర్వహించే సరికే పిల్లలు ప్రైవేట్‌లో చేరే అవకాశాలు ఉన్నాయని పలువురు చెర్చించుకుంటున్నారు.

వ్యాపారంగా మలుచుకొని..
జిల్లాలో ఒకప్పుడు ప్రైవేట్ పాఠశాలలు మండలానికి ఒకటో.. రెండో ఉండేవి. ప్రస్తుతం ఎక్కడబడితే అక్కడ దర్శనమిస్తున్నాయి. విద్యను వ్యాపారంగా మలిచారు. కనీస సౌకర్యాలు లేకపోయినా అధిక ఫీజులతో తల్లిదండ్రులను పీల్చిపిప్పిచేస్తున్నారు. ఎల్‌కేజీ మొదలు.. పదోతరగతి వరకు డొనేషన్లు, ఫీజులు, పుస్తకాలు, నోట్‌బుక్స్, ప్రాజెక్టులు, బస్సు ఫీజులు వంటి తదితర ఖర్చులతో మోతమోగిస్తున్నారు. విద్యార్థులను ర్యాంకుల పేరుతో బట్టీ పట్టించి..తరగతికో రేటు కట్టి చదువును అమ్మకపు సరుకుగా చేస్తున్న విద్యాసంస్థలపై విద్యాశాఖ అధికారులు సైతం దృష్టి సారించడం లేదు. డీఈవో పరిధిలో 700 వరకు ప్రభుత్వ యా జమాన్య పాఠశాలలు ఉండగా, దాదాపు 200 వరకు ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. మరోవైపు ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణ తమ పరిధిలో లేదంటూ విద్యాశాఖ అధికారులు చెబుతుండడం గమనార్హం.

నిబంధనలకు తూట్లు..

ప్రైవేట్ పాఠశాలలపై విద్యాశాఖ పర్యవేక్షణ కొరవడింది. ఫీజుల నియంత్రణ కోసం ప్రభుత్వం జారీ చేసిన జీవో నం.1 అమలు కావడం లేదు. తల్లిదండ్రులతో కూడిన గవర్నింగ్ బాడీ ఏర్పాటు చేయాలి. నిబంధనల ప్రకారం పాఠశాలలో 700 చదరపు మీటర్ల విస్తీర్ణంలో క్రీడా మైదానం ఉండాలి. అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. చాలా పాఠశాలలకు ఫైర్ సేఫ్టీ సౌకర్యాలు లేవు. ఇరుకు గదుల్లో, చుట్టూ వాహనం తిరిగే స్థలం లేని భవనాల్లో స్కూళ్లను ఇష్టానుసారంగా నడిపిస్తున్నారు. బీఎడ్, డీఎడ్ పూర్తి చేసిన వారిచే విద్యాబోధన చేయించాల్సి ఉండగా, విద్యార్హత లేనివారితో చదువులు కొనసాగిస్తున్నారు. ఫీజుల వివరాలు బోర్డుపై ప్రదర్శించాల్సి ఉండగా, ఏ పాఠశాలలో కూడా అలా జరగడం లేదు. చాలా ప్రైవేట్ పాఠశాలలు ఇలా నిబంధనలను తుంగలో తొక్కుతూ ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

ప్రచారం షురూ..
జిల్లా కేంద్రంతో పాటు ఆయా మండలాల్లో ప్రైవేట్, కార్పొరేట్ యాజమాన్యాల ప్రచారం ఊపందుకుంది. ఎండలు దంచికొడుతున్నా ఇంటింటికి తిరుగుతూ విద్యార్థుల వివరాలను సేకరిస్తున్నారు. తమ పాఠశాలలో చేర్పిస్తే ఫీజులో రాయితీ కల్పిస్తాం.. బస్సు సౌకర్యం వంటి తదితర మాయమాటలు చెప్పి తల్లిదండ్రులను ఒప్పిస్తున్నారు. అందులో చేరాక ఫీజులు పూర్తిస్థాయిలో ముక్కుపిండి వసూలు చేస్తుండడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. గతేడాది ప్రభుత్వ పాఠశాలల్లో నుంచి 5వేల మంది విద్యార్థులు ప్రైవేట్‌లో చేరారు.

సర్కారు బడుల్లో చేర్పించాలి



సర్కారు బడుల్లోనే నాణ్యమైన బోధన అందుతుంది. అర్హత గల ఉపాధ్యాయులతో పాటు వసతులు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంటాయి. మధ్యాహ్నభోజనం, ఉచిత యూనిఫాం, పాఠ్యపుస్తకాలు తదితర సౌకర్యాలు కల్పించడం జరుగుతుంది. తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలి. ప్రైవేట్ విద్యాసంస్థలు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలి. లేకుంటే కఠిన చర్యలు తప్పవు.
– శ్రీనివాస్ రెడ్డి, డీఈవో

బొట్టు బొట్టు ఒడిసి పట్టేలా..



ఇక్కడ కనిపిస్తున్నది నార్నూర్ మండలంలోని పొలాల్లో గల బోర్‌వెల్ వద్ద ఉపాధి హామీ నిధులతో చేపట్టిన బోర్‌వెల్ రీచార్జ్ స్ట్రక్చర్. వర్షపునీటిని సంరక్షించి బోర్‌వెల్‌లో నీటిమట్టం పెరిగేందుకు దోహదపడేలా నిర్మిస్తున్నారిలా.

- భూగర్భజలాల పెంపుపై ఫోకస్
- నీటి కుంటలు, ఇంకుడుగుంతలు మంజూరు
- ఉపాధి హామీ నిధులతో నిర్మాణాలు
- సద్వినియోగం చేసుకుంటే జల సంరక్షణకు దోహదం

కైలాస్‌నగర్: మండుతున్న ఎండల తీవ్రతతో భూగర్భజలాలు ప్రమాదఘంటికలను మోగిస్తున్నాయి. జిల్లాలోని పలు మండలాల్లో 18 నుంచి 20 మీటర్ల లోతు వరకు నీటిమట్టం పడిపోయింది. ప్రస్తుతం 150 నుంచి 300 అడుగుల లోతు వరకు బోర్లు వేస్తే కానీ నీరు పడని పరిస్థితి. మరి కొన్నిచోట్ల అంతకు మించి వేయాల్సిన దుస్థితి. ఇదే కొనసాగితే భవిష్యత్తులో నీటి ఎద్దడి మరింత తీవ్రరూపం దాల్చే అవకాశముంది. ఈ నేపథ్యంలో భూగర్భజలాల సంరక్షణపై జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ దృష్టి సారించింది. వర్షపునీటిని ఒడిసిపట్టి సంరక్షించే చర్యలకు శ్రీకారం చుట్టింది. ఉపాధి హామీ నిధులతో బోర్‌వెల్ రీచార్జి స్ట్రక్చర్స్ (భూగర్భ జల పెంపు నిర్మాణాలు), రూఫ్ టాప్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్స్(పైకప్పు నీటి సంరక్షణ నిర్మాణాలు), ఫాం పాండ్స్(నీటికుంటలు), కమ్యూనిటీ సోక్‌పిట్స్ (సామాజిక ఇంకుడుగుంతలు) నిర్మించేందుకు సంకల్పించింది. 2025–26 సంవత్సరానికి గాను ఆయా నిర్మాణాలకు సంబంధించి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసింది. వీటిని సద్వినియోగం చేసుకుని లక్ష్యం మేరకు నిర్మాణాలు చేపట్టినట్లేతే భూగర్భ జలాలను సంరక్షించిన వారమవుతామనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

బోర్‌వెల్ రీచార్జి స్ట్రక్చర్స్..
వర్షపునీటితో పాటు ఇతర భూమిపై ఉన్న నీటిని సంరక్షించేలా ఇప్పటికే ఉన్న బోర్‌వెల్స్ వద్ద నీటిని లోనికి మళ్లించడం ద్వారా భూగర్భజలాల ను తిరిగి నింపేందుకు ఇవి తోడ్పడుతాయి. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 240 స్ట్రక్చర్స్ నిర్మించాలని నిర్ణయించగా ఇప్పటివరకు 85 మంజూరు చేశారు. ఒక్కో స్ట్రక్చర్స్‌ను రూ.25వేలతో నిర్మించుకునే అవకాశముంది. ఇప్పటి వరకు ఆరు నిర్మాణాలను గ్రౌండింగ్ చేశారు.

ఫాంపాండ్స్
పంటచేలల్లో నీటిని నిల్వ చేసేందుకు చిన్నపాటి కుంటలను నిర్మిస్తారు. వీటినే ఫాంపాండ్స్ అని పిలుస్తారు. వర్షాకాలంలో వచ్చే నీటిని నిల్వ చేసుకోవడం ద్వారా వేసవిలో పంటలకు నీరందించేందుకు తోడ్పడుతుంది. జిల్లావ్యాప్తంగా 392 నిర్మించాలని నిర్ణయించిన అధికారులు 332 మంజూరు చేశారు. అందులో 94 నిర్మాణాలు పూర్తయ్యాయి. ఒక్కోదానికి రూ.2.50లక్షల ఉపాధి నిధులు వెచ్చిస్తారు.

కమ్యూనిటీ సోక్‌పిట్స్..
గ్రామీణ, పట్టణప్రాంతాల్లోని చేతిపంపుల వద్ద వీటిని నిర్మించనున్నారు. జిల్లాలో కమ్యూనిటీ సోక్‌పిట్స్ నిర్మాణలక్ష్యం 183 కాగా 45 మంజూరు చేశారు. ఒక్కో దాన్ని రూ.12వేల వ్యయంతో నిర్మించనున్నారు. ఇందులో ఇప్పటి వరకు ఏడు గ్రౌండింగ్ చేశారు. మిగతా వాటిని ఈ ఆర్థికసంవత్సరంలో పూర్తిచేసేలా ముందుకు సాగుతున్నారు. వీటి నిర్మించడం ద్వారా వర్షపు నీటితో పాటు చేతిపంపుల నుంచి వచ్చే వృథానీటిని తిరిగి భూమిలోకి ఇంకేలా చేస్తాయి.

రూఫ్‌టాప్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్స్
వర్షాకాలంలో భవనాలపై పడే నీటిని నిల్వచేసేందుకు ఈ స్ట్రక్చర్స్ తోడ్పడనున్నాయి. గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ, ఇతరత్రా ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్న 31చోట్ల నిర్మించాలని నిర్ణయించగా ఇందులో 8 మంజూరు చేశారు. ఒక్కోదాన్ని రూ.25వేలతో నిర్మిస్తారు. ఇప్పటి వరకు ఒకటి పూర్తి చేశారు. ఆయా కార్యాలయాలపైపడిన వర్షపునీరు వృథాగా పోకుండా భూ మిలోకి ఇంకించేలా ఈ స్ట్రక్చర్ నిర్మించనున్నారు.

భూగర్భజలాల పెంపునకు చర్యలు

జిల్లాలో భూగర్భజలాలు అడుగంటి పలుచోట్ల బోరుబావులు, చేదబావులు ఎండిపోయాయి. నీటిని సంరక్షించకపోవడమే ఇందుకు ప్రధాన కారణం. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితి తలెత్తకుండా ఉండేలా భూగర్భజలాలను పెంపొందించేలా ఉపాధి నిధులతో ప్రత్యేక నిర్మాణాలు చేపట్టాలని ప్రభుత్వం సంకల్పించింది. ఈమేరకు లక్ష్యాలను నిర్ణయించాం. వందశాతం సాధించేలా చర్యలు చేపడుతున్నాం. ప్రజలు, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.
– రాథోడ్ రవీందర్, డీఆర్డీవో

భూభారతిపై అవగాహన అవసరం

ఇచ్చోడ: భూభారతి చట్టంపై ప్రతీ ఒక్కరికి అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో జిల్లా వ్యాప్తంగా సదస్సులు నిర్వహిస్తున్నామని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మండల కేంద్రంలోని షార్ప్‌గార్డెన్‌లో ఆదివారం నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. భూభారతి చట్టంతో భూసమస్యలకు సత్వర పరిష్కారం లభించనుందని అన్నారు. అనంతరం పలువురు రైతులు తమ సమస్యలను కలెక్టర్‌కు విన్నవించగా పరిష్కార దిశగా ఆయన సూచనలు చేశారు. ఇందులో అదనపు కలెక్టర్ శ్యామలాదే వి, ఆర్డీవో వినోద్‌కుమార్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజా రెడ్డి, మార్కెట్ చైర్‌పర్సన్ సత్యవతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

సిరికొండలో..
సిరికొండ: మండల కేంద్రంలో భూభారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ, రైతులకు ఎలాంటి భూ సమస్య ఉన్న భూభారతి ద్వారా పరిష్కరించుకోవచ్చని అన్నారు.

ఆదివాసీలపై దమనకాండను ఆపాలి

ఆదిలాబాద్‌రూరల్: అమాయక ఆదివాసీలపై ప్రభుత్వాలు చేపడుతున్న దమనకాండను వెంటనే నిలిపివేయాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనం నుంచి కుమురంభీం చౌక్ వరకు ఆదివారం కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆదివాసీ అమాయకులపై జరుగుతున్న ఎన్‌కౌంటర్లను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి శాంతి చర్చలు జరిపించాలన్నారు. ఇందులో వివిధ సంఘాల నాయకులు గోడం గణేశ్, సాజిద్‌ఖాన్, మల్లేశ్, శంకర్, సచిన్, తదితరులు పాల్గొన్నారు.



కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న నాయకులు

అధిక వడ్డీ వసూలు చేస్తే కఠిన చర్యలు

- డీఎస్పీ జీవన్‌రెడ్డి
- జైనథ్‌లో వడ్డీ వ్యాపారిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): అధిక వడ్డీ వసూలు చేసే వ్యాపారులపై కఠిన చర్యలు తప్పవని ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి హెచ్చరించారు. అమాయక ప్రజలు, రైతుల వద్ద అధిక వడ్డీ వసూలు చేస్తూ వారి భూములను వడ్డీ పేరుతో రాయించుకుంటున్న ఓ వడ్డీ వ్యాపారిపై జైనథ్ పోలీస్‌స్టేషన్‌లో రెండు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. జైనథ్ స్టేషన్‌లో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. జైనథ్ మండలం కేదార్‌పూర్ గ్రామానికి చెందిన బోయర్ రమేశ్ 2011లో 25 శాతం వడ్డీతో రూ.3 లక్షలు ఇచ్చి తన 1.36 ఎకరాల భూమిని తన తమ్ముడు గజానన్ పేరిట రాయించుకున్నాడని జైనథ్ రైతు గోస్కుల నర్సయ్య ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు. 2013లో బాధితుడు రూ.2 లక్షలు, 2017 సంవత్సరంలో రూ.2 లక్షలు చెల్లించాడు. తిరిగి తన భూమిని తనకు ఇచ్చేయాలని చెప్పినా నిరాకరించడంతో కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. వ్యాపారిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. అలాగే అతడి ఇంటి వద్ద తనిఖీ చేయగా సంతకం చేసిన రెండు ఖాళీ బ్యాంకు చెక్కులు, 32 సేల్ డీడ్లు, రెండు ధరణి సేల్‌డీడ్లు, 31 ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. వాటి విలువ దాదాపు రూ.కోటి 55 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. మనీ లెండర్స్ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. సమావేశంలో జైనథ్ సీఐ డి.సాయినాథ్, ఎస్సై పురుషోత్తం పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

'ఉపాధి' పనిదినాల్లో కోత

- గతేడాది లక్ష్యంతో పోల్చితే ఈ సారి 28లక్షలు తగ్గింపు
- కూలీలకు తీవ్ర నష్టం
- కొత్త జాబ్ కార్డులకు పెరిగిన డిమాండ్

జిల్లాలో ఉపాధి పనుల వివరాలు..
గ్రామీణ మండలాలు : 20
పంచాయతీలు : 473
జాబ్‌కార్డుల సంఖ్య : 1.74లక్షలు
నమోదు చేసుకున్న కూలీలు: 3.47లక్షలు
యాక్టివ్ జాబ్‌కార్డులు : 1.09 లక్షలు
పనులకు హాజరయ్యే కూలీలు : 2.04 లక్షలు



ఉపాధి పనుల్లో నిమగ్నమైన కూలీలు

కైలాస్‌నగర్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై ఆధారపడ్డ కూలీలకు కేంద్ర ప్రభుత్వం షాకిచ్చింది. 2025–26 సంవత్సరానికి గాను చేపట్టాల్సిన పనిదినాల్లో భారీగా కోత విధించింది. గతేడాది లక్ష్యానికి మించి పనులు జరగడంతో కూలీలకు వేసవిలో ఉపాధి లభించింది. జిల్లావ్యాప్తంగా 5,378 కుటుంబాలు వంద రోజుల పాటు పని చేశాయి. అయితే ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా ఉపాధి పనిదినాలను తగ్గించగా జిల్లాకు కేటాయించిన లక్ష్యంలోనూ భారీగా గండిపడింది. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో చేసిన పనుల ఆధారంగా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని అమలు చేస్తుండటంతో జాబ్‌కార్డుల కోసం కొత్తగా దరఖాస్తు చేసుకునే వారి సంఖ్య పెరుగుతోంది. ఈ నేపథ్యంలో పనిదినాలు తగ్గడంతో కూలీల ఉపాధిపై తీవ్ర ప్రభావం పడే అవకాశముంది.

గతేడాది లక్ష్యానికి మించి..
2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను జిల్లాకు 52.35 లక్షల పనిదినాలను కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. గ్రామీణ ప్రాంత కూలీలు ఈ అవకాశాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకున్నారు. కూలీల సంఖ్య పెరగడంతో జిల్లావ్యాప్తంగా 54.84లక్షల పనిదినాలు జరిగాయి. దీంతో 104.75శాతం నమోదైంది. లక్ష్యానికి మించి పనులు జరగడంతో కేంద్ర ప్రభుత్వం జిల్లాకు ప్రత్యేక బృందాలను పంపించి పనుల ప్రగతిపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టింది. క్షేత్రస్థాయిలో పనులకు కూలీలు వాస్తవంగా హాజరవుతున్నారా లేక బోగస్ హాజరు నమోదు చేస్తున్నారా అనే దాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. కొన్ని పనులు కేంద్ర నిబంధనల ప్రకారం జరగకపోవడంతో పనిదినాలను భారీగా తగ్గించినట్లుగా తెలుస్తోంది. కాగా ఈ ఏడాదికి కేవలం 23.81లక్షల పని దినాలు మాత్రమే నిర్దేశించింది. గతేడాదితో పో ల్చితే 28లక్షల పనిదినాలను తగ్గించింది. దీంతో ఉపాధి హామీ పనులపై ఆధారపడ్డ కూలీలు కేంద్ర నిర్ణయంపై తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

ప్రశ్నార్థకంగా 'ఉపాధి'
ఈ ఏడాదికి 23.81 లక్షల పనిదినాలను లక్ష్యంగా కేటాయించగా అందులో ఇప్పటికే 11.21 లక్షల పనిదినాలు పూర్తయ్యాయి. వ్యవసాయ పనులు జరగకపోవడంతో మే నెలంతా ఉపాధి పనులు ముమ్మరంగా సాగనున్నాయి. రుతుపవనాల ఆగమనంతో వర్షాలు కురిసే జూన్ వరకు కూలీలు ఉపాధి పనులకు హాజరయ్యే అవకాశముంది. వ్యవసాయ పనులు ప్రారంభమైతేనే కూలీల సంఖ్య తగ్గే అవకాశముంటుంది. అయితే ఈ రెండు నెలల్లోనే జిల్లాకు కేటాయించిన పనుల లక్ష్యం పూర్తయ్యే అవకాశం కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో లక్ష్యం పూర్తయితే మిగతా సమయాల్లో ఉపాధి పనులను చేపట్టి కూలీలకు పనులు కల్పిస్తారా లేక నిలిపివేస్తారా అనేది ప్రశ్నార్థకంగా మారింది. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి జాబ్ కార్డుల ఆధారంగా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద కూలీలకు రూ.12వేల ఆర్థికసాయం అందజేయాలని నిర్ణయించింది. దీంతో కొత్తగా జాబ్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునే వారి సంఖ్య పెరుగుతోంది. అలాగే జాబ్ కార్డు కలిగి ఉండి పనులకు హాజరుకానటువంటి వారు కూడా పనులకు వచ్చేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలో పనిదినాల లక్ష్యం పెంచాల్సిన అవసరముందనే అభిప్రాయం కూలీల నుంచి వ్యక్తమవుతోంది.

లక్ష్యం మేరకు పనులు కల్పిస్తాం

గతేడాదితో పోల్చితే కేంద్ర ప్రభుత్వం ఈ సారి పనిదినాలను తగ్గించింది. రాష్ట్రవ్యాప్తంగా పనిదినాలను తగ్గించగా జిల్లాకు కేటాయించిన లక్ష్యంలో కోత పడింది. అయితే దరఖాస్తు చేసుకున్న ప్రతీ కూలీకి ప్రస్తుతం పనులు కల్పించేలా శ్రద్ధ వహిస్తున్నాం. నిర్దేశిత లక్ష్యం మేరకు పనులు కల్పిస్తాం. అప్పటికీ కూలీల నుంచి పనుల కోసం డిమాండ్ ఉంటే రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తగు చర్యలు తీసుకుంటాం.
– రాథోడ్ రవీందర్, డీఆర్డీవో